క్లుప్తంగా

తొలిదశలో గుర్తిస్తే సులభంగా క్యాన్సర్ నివారణ



నాదెండ్ల: మహిళల్లో క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తిస్తే ఆధునిక వైద్య చికిత్సలతో పూర్తిగా నయం చేసుకోవచ్చని అమెరికన్ అంకాలజీ ఇన్‌స్టిట్యూట్ వైద్యురాలు ఎం.హర్షదీప్తి చెప్పారు. గణపవరం చుండి రంగనాయకులు కళాశాలలో బుధవారం క్యాన్సర్‌పై విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల్లో ఎక్కువగా కనిపించే బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్‌లను తొలిదశలో గుర్తిస్తే నూరుశాతం నివారణ సాధ్యమన్నారు. వ్యాధికి కారణాలు, గుర్తింపు, చికిత్సలపై అవగాహన కల్పించారు. క్యాన్సర్ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం వైద్యురాలు హర్షదీప్తిని శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ సీహెచ్ చైతన్య, అధ్యాపకులు ఉషారాణి, అల్లాబీ, రమ్యశ్రీ పాల్గొన్నారు.

ఉమెన్స్ సేఫ్టీ యాప్‌పై అవగాహన



నరసరావుపేట ఈస్ట్: బాలికలు, మహిళలు ఆత్మస్థైర్యంతో ముందడుగు వేస్తూ తమ రక్షణ పట్ల అప్రమత్తతతో వ్యవహరించాలని ఎస్ఐ కె.ప్రియాంక తెలిపారు. కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో బుధవారం మహిళా పోలీస్ ఆధ్వర్యంలో ఉమెన్ సేఫ్టీ యాప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఎస్ఐ ప్రియాంక మాట్లాడుతూ విద్యార్థినిలు తమకు ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా పోలీసుల దృష్టికి తీసుకువచ్చి తగిన రక్షణ పొందాలని తెలిపారు. ఫేస్ బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగామ్‌లో జరిగే మోసాలను విద్యార్థినులకు వివరించారు. అపరిచిత వ్యక్తులతో పరిచయాలు ప్రమాదాలకు దారితీస్తాయని హెచ్చరించారు. అవసరానికి మించి సెల్‌ఫోన్ వాడకం సమస్యలకు దారితీస్తుందని తెలిపారు. ఏదైనా అనుమానాస్పద అంశం ఎదురైనప్పుడు తల్లిదండ్రులు, స్నేహితులతో పంచుకోవటం ద్వారా ఆపదల నుంచి బయట పడవచ్చని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ ఎం.శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

జీడీసీఎంఎస్ మాజీ మేనేజర్ గంగయ్య మృతి



నాదెండ్ల: ఉమ్మడి గుంటూరు జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ మాజీ మేనేజర్, సంకురాత్రిపాడు గ్రామానికి చెందిన కట్టిబోయిన గంగయ్య (66) మంగళవారం రాత్రి మృతి చెందారు. ఈయన గత పదిహేను రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ గుంటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆరోగ్యం విషమించి మంగళవారం రాత్రి మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ గ్రామానికి చేరుకుని గంగయ్య మృతదేహానికి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. గంగయ్య సోదరుడు కట్టిబోయిన వీరాస్వామి వైఎస్సార్‌సీపీ నాయకుడిగా ఉంటూ గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శివమాణిక్యాలు, జెట్టి బొల్లయ్య, బత్తుల చినవెంకటేశ్వర్లు, బిక్షాలు, క్రీస్తురాజు, గేరా కుమార్, గొర్రె శివ, ఏసురత్నం ఉన్నారు.

షూటింగ్ బాల్ పోటీల్లో తృతీయస్థానం

అక్కాచెల్లెళ్ల ప్రతిభను అభినందించిన విశ్వతేజ మిల్లు యాజమాన్యం



యడ్లపాడు: రాష్ట్రస్థాయి బాలికల షూటింగ్‌బాల్ పోటీలలో యడ్లపాడు గ్రామానికి అక్కాచెల్లెళ్లు సత్తాచాటారు. ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు అనంతపురం జిల్లా శ్రీనేతాజీ ఇంగ్లిష్ మీడియం హైస్కూలో 43వ రాష్ట్రస్థాయి పోటీలు జరిగాయి. అండర్ -17, అండర్ -19 విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 10 జిల్లాల నుంచి జట్లు పాల్గొన్నాయి. ఉమ్మడి గుంటూరు తరుపున అండర్ -19 బాలికల విభాగంలో బాపట్ల జిల్లాజట్టు అనంతపురం జట్టుపై హోరాహోరీగా పోరాడి రెండు, సున్నా తేడాతో తృతీయస్థానంలో నిలిచింది. ఈ జట్టు విజయానికి కృషి చేసిన కెప్టెన్ కోడిరెక్క ధనలక్ష్మి, పాప తమ ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా బుధవారం యడ్లపాడు మండలం బోయపాలెం గ్రామంలోని విశ్వతేజ నూలుమిల్లు యాజమాన్యం అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించాలని, అక్కాచెల్లెళ్ల పట్టుదలను ప్రశంసించారు. వీరితో పాటు జట్టు సభ్యులు శశి, చార్వి, మాధ్యూ,తన్మయి, శృతి, జెస్రా, జేసుశ్రీ శిక్షణ ఇచ్చిన కోచ్‌లు తమ్మా శ్రీనివాస రెడ్డి, మురళీకృష్ణరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిని అభినందించారు.

భూమి పూజచేసి...

నిర్మాణం మరిచారు



- శావల్యాపురంలో భూమి పూజకే పరిమితమైన ప్రభుత్వ పెట్రోలు బంకు నిర్మాణం
- నాడు రెండు నెలల్లో పూర్తి చేస్తామన్నారు • నేడు ఒక్క అడుగు ముందుకు పడితే ఒట్టు

శావల్యాపురం: పెట్రోలు బంకుల ద్వారా ప్రభుత్వానికి ఆదాయ మార్గాలు పెంపుదలకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈక్రమంలో మండలంలోని కనమర్లపూడి గ్రామం జాతీయ రహదారి మార్గం వెంబడి 30 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని గురించారు. ఇందులో భారత్ పెట్రోలు వారి సారథ్యంలో నూతన పెట్రోలు బంకు ఏర్పాటుకు ఈ ఏడాది మార్చిలో భూమి పూజ కార్యక్రమానికి అప్పటి జిల్లా కలెక్టరు శివశంకర్ శ్రీకారం చుట్టారు.

అయితే నెలలు గడుస్తున్నా నేటి వరకు ఈ పనులు ప్రారంభం కాకపోవటంతో అధికారుల తీరుపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారి వెంబడి పెట్రోలు బంకు ఏర్పాటు చేయటం ద్వారా చుట్టు పక్కల భూములకు మంచి గిరాకీ ఉంటుందని స్థానికుల మాట. నెలకు రూ. 3 లక్షల ఆదాయం రావటంతో పాటు పలువురికి ఉపాధి మార్గాలు కల్గుతాయి. పెట్రోలు బంకు రూ. కోటి రూపాయల నిధులు మంజూరు కాగా రెండు నెలల వ్యవధిలో పనులన్నీ పూర్తి చేస్తామని అప్పటి కలెక్టరు శివశంకరు వెల్లడించారు. భూమి పూజ చేయటం మినహా నేటి వరకు ఎలాంటి పనులు ప్రారంభం కాలేదు. బంకు ద్వారా వచ్చే ఆదాయం



నిర్మాణానికి నోచుకోకుండా ఖాళీగా కనిపిస్తున్న ప్రభుత్వ స్థలం

25 శాతం వరకు స్థానిక రెవెన్యూ కార్యాలయానికి వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఆధునీకరణ యంత్ర పరికరాలు, కాలుష్యం లేని విధంగా సీఎన్‌జీ గ్యాస్ పెట్రోలు బంకుల్లో అందుబాటలోకి వచ్చేలా అనుమతులు జారీ చేశారు. పెట్రోల బంకుల ద్వారా వచ్చే అదనపు ఆదాయం జిల్లా



భూమి పూజలో పాల్గొన్న జిల్లా కలెక్టరు లోతేటి శివశంకరు, అధికారులు (పాతచిత్రం)

కలెక్టరు అనుమతి ద్వారా నిరుపేదలకు సంక్షేమ పథకాలు రూపంలో మంజూరు చేస్తుంది. అయితే నేటి వరకు ఇందుకు సంబంధించి ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడంపై సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

నాడు హడావిడిగా భూమిపూజ చేసి నేటి వరకు దీనివైపు యంత్రాంగం కన్నెత్తి చూడకపోవడంపైనా చర్చసాగుతోంది. జిల్లాయంత్రాంగం ఈ బంకు నిర్మాణ విషయమై ఓమారు పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పనులు త్వరితగతిన పూర్తిచేయాలి



పెట్రోలు బంకు ఏర్పాటు చేయటం మంచిది. చుట్టు పక్కల పొలాలకు డిమాండ్ పెరుగుతుంది. జాతీయ రహదారి వెంబడి ఉండటం ద్వారా వాహనదారులకు సులువుగా మెరుగైన సేవలు అందుతాయి. పంచాయతీకు కూడా ఆదాయం పెరుగుతుంది. త్వరితగతిన పెట్రోలు బంకు నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

–ముక్కపాటి నాగేశ్వరరావు, కనమర్లపూడి

స్థానికులకు ఉపాధి లభిస్తుంది



ప్రభుత్వం సారథ్యంలో ఏర్పాటు చేయనున్న పెట్రోలు బంకులో సీఎన్‌జీ గ్యాస్ ఏర్పాటు చేస్తే వాహనదారులకు ఎంతో మేలు కలుగుతుంది. చుట్టుపక్కల గ్రామాల్లోని వారందరూ ఇలాంటి అవకాశాలు సద్వినియోగం చేసుకుంటారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు ఉంటాయి. ప్రభుత్వం సత్వరమే స్పందించి పనులు ప్రారంభించేలా అధికారులు కసరత్తు చేయాలి.

–పోట్లూరి మల్లికార్జునరావు, శావల్యాపురం

పదిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

డిప్యూటీ డీఈవో వేణుగోపాలరావు



నరసరావుపేట రూరల్: పదవ తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేవిధంగా ఉపాధ్యాయులు కృషిచేయాలని డిప్యూటీ డీఈవో వేణుగోపాలరావు తెలిపారు. మండలంలోని ఉప్పలపాడు జెడ్పీ హైస్కూల్‌ను బుధవారం ఆయన వార్షిక తనిఖీ నిర్వహించారు. పాఠశాలలోని ఉపాధ్యాయుల బోధనను, విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాలలోని మౌలిక సదుపాయాలు, చిక్కీల పంపిణీ, మధ్యాహ్న భోజన పథకం, మరుగుదొడ్ల నిర్వాహణ తదితర అంశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల రావు మాట్లాడుతూ పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు పనిచేయాలని తెలిపారు. సీ,డీ గ్రేడ్ విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పరిశీలకులుగా జేసుదాసు, ఎస్‌పీకె మొహిద్దీన్ సాహెబ్, ఎస్.శ్రీనివాసరావు, ఎన్.రామకృష్ణారెడ్డి, బీవిహెచ్ రఘురామ్ పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఏవి మధుకుమార్, ఎస్.నాగేశ్వర రావులు హాజరయ్యారు.

నేడు ఓటుహక్కు కల్పనకు ప్రత్యేక కేంద్రాలు

నరసరావుపేట: పట్టణంలో 18ఏళ్లు నిండిన వారందరికీ ఓటుహక్కు కల్పించేందుకు గురువారం ఎస్ఎస్ఎన్ కళాశాల, పీఎన్‌సీ అండ్ కేఆర్ కళాశాల, ఎస్‌కేఆర్‌బీఆర్ కళాశాల, కృష్ణవేణి డిగ్రీ కళాశాలల్లో ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తున్నట్లు అసిస్టెంటు ఎన్నికల అధికారి, మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంత రావు బుధవారం పేర్కొన్నారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచండి

చేపట్టిన పనులు పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట: పట్టణం మొత్తం పరిశుభ్రంగా ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన పట్టణంలో పలుచోట్ల చేపట్టిన సీసీ రోడ్డు ప్యాచ్ వర్కు పనులు, పూర్తయిన కల్వర్ట్ పనులు, డామేజ్ అయిన రోడ్లు పరిశీలించారు. శిశుమందిరం స్కూల్ వద్ద డ్రైనేజ్ కాలవ పనులు, బైపాస్‌రోడ్డులో గల డంపింగ్ వద్ద జరుగుతున్న పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. యార్డులో చెత్త తగలబడకుండా చూడాలని, చెత్తకు నిప్పు అంటుకోవటం ద్వారా పట్టణంలోని పొగ వ్యాపించి దుర్వాసన వస్తుందని, దీనిని అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. మున్సిపల్ అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు విజయవంతం చేయండి

టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ కోరారు. గుంటూరు రోడ్డులోని తన కార్యాలయం



బరంపేట శిశుమందిరం ఏరియాలో డ్రెయిన్ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

లో నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వం ఉంటే ప్రతి కార్యకర్తకూ ధైర్యం, భరోసా ఉంటుందన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయంగా పార్టీ ఆవిర్భవించిందని, ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తోందని చెప్పారు. సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు రూ.5 లక్షల ఇన్సూరెన్స్ లభిస్తుందని చెప్పారు. రేషన్ డీలర్లు, నాయకులు పాల్గొన్నారు.

పైరుకు అవసరమైనంత ఎరువులు వాడాలి

రొంపిచర్ల: పైరుకు అవసరమైనమేర కాంప్లెక్స్, నత్రజని, పొటాష్ ఎరువులు వాడితే తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు. మండల కేంద్రమైన రొంపిచర్లలో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గ్రామంలో రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న, శనగ, మిరప పంటలను వ్యవసాయ శాఖ శాస్త్రవేత్త డాక్టర్ నగేష్, జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం.శివకుమారి పరిశీలించారు. మొక్కజొన్నలో నత్రజని, భాస్వరం లోపాలను గుర్తించి తగు నివారణ చర్యలు గురించి వివరించారు. మొక్కజొన్నలో నత్రజని లోప నివారణకు హెక్టార్‌కు 230 కేజీల నత్రజని, 69 కిలోల భాస్వరం, 60కిలోల పొటాష్ ఎరువులు పంట కాలం మొత్తానికి సరిపోతుందని



మొక్కజొన్న పొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు

అన్నారు. పంటల సాగులో కలుపు నివారణ చర్యలు గురించి వివరించారు. రైతులు ఈక్రాఫ్ బుకింగ్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీఏ పి.మస్తానమ్మ, మండల వ్యవసాయ అధికారిణి పి.శివలలిత, వీఏఏలు, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా 'విశ్వసాయి' వార్షికోత్సవం

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని విశ్వసాయి జూనియర్ కళాశాల 7వ వార్షికోత్సవం కారంపూడి రోడ్డులోని బ్రహ్మనాయుడు కన్వెన్షన్ నందు బుధవారం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ఏపీ చీఫ్‌విప్, స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పాల్గొని మాట్లాడుతూ కన్నతల్లిని, జన్మభూమిని మరువరాదని, చదువుతో పాటు సంస్కారాన్ని నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. వివిధ ఆటల పోటీల్లో విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం జీవీ ఆంజనేయులును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి, మాజీ చైర్మన్ పెండేల శ్రీనివాసరావు, కౌన్సిలర్ షకీలా, బెజవాడ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బీవీ నాగేశ్వరరావు, గాలి శ్రీనివా



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఏపీ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

సరావు, బి.రవికుమార్, ఎ.నాగేశ్వరరావు, మేడం రమేష్, మారుతివరప్రసాద్, కృష్ణవేణి డిగ్రీ కళాశాల డైరెక్టర్ పానుగంటి సీతారామారావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఈ -క్రాప్ నమోదు

యడ్లపాడు: రబీ సీజ్‌కు సంబంధించి ఈ -క్రాప్ నమోదు ప్రక్రియ మండలంలో గురువారం నుంచి ప్రారంభం కానుందని మండల వ్యవసాయ అధికారి సీహెచ్ సరిత తెలిపారు. బుధవారం లింగారావుపాలెం గ్రామంలో పొలంబడి కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. మందుగా గ్రామంలోని మాగాణి, పత్తి పంటల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ఏవో మాట్లాడుతూ రబీ సీజ్‌లో సాగు చేసిన శనగ, మొక్కజొన్న, పొగాకు, వరి పంటల్ని రైతులు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని సూచించారు. మాగాణి రైతులు తమ పంటను బీమా చేయించుకోవాలని సూచించారు. ఎకరాకు 630 చొప్పున ప్రీమియంను డిశంబర్‌నెల 31వ తేదీ వరకు చెల్లించే వెసులు బాటు ఉందన్నారు. అలాగే పత్తి తీతలు త్వరగా తీసుకుని సురక్షిత ప్రాంతాల్లో భద్రపరుచుకోవాలన్నారు. ఇప్పటికే తీతలు పూర్తయిన రైతులు పత్తిని ఆరబెట్టి సీసీఐ కేంద్రాల్లో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు విక్రయించుకోవాలని తెలిపారు. అయితే కేంద్రానికి తీసుకువెళ్లే సమయంలో సీసీఐ నిబంధనలు విధిగా పాటించాల్సి ఉందని గుర్తు చేశారు.

బాల్య వివాహాల నివారణకు కృషి చేయండి

నరసరావుపేటటౌన్: బాల్య వివాహ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అదనపు సీనియర్ సెషన్స్ జడ్జి కె.మధుస్వామి పిలుపునిచ్చారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహ రహిత భారతదేశం కార్యక్రమంలో భాగంగా బీసీ కళాశాల వసతి గృహంలో బుధవారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. బాలల హక్కులు, పరిరక్షణకు ఉన్న చట్టాల గురించి వివరించారు. విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ హరిబాబు, వెల్ఫేర్ ఆఫీసర్ మణికుమారి, ప్యానల్ న్యాయవాదులు, న్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టండి

బొల్లాపల్లి: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బాల్యవివాహ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో క్యాండిల్ ర్యాలీతో పాటు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన బండ్లమోటు ఎస్ఐ ఎ.బాలకృష్ణ మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్యవివాహాలు జరిపిస్తే చట్టరీత్యా చర్యలు ఉంటాయన్నారు. ఈ వివాహాల ద్వారా అనారోగ్య సమస్యలు, మాతృ సమస్యలు వచ్చే అవకాశం ఉందని, వీటిని అరికట్టే దిశగా ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వి.శ్రీదేవి, షేక్ మస్తాన్‌బీ, ఏఎస్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, ఆశ కార్యకర్తలు గ్రామపెద్దలు, కిషోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేట: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వీటిని అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీడీవో శ్రీనివాసరావు చెప్పారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మండలంలోని పోతవరంలో ఉన్న కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో బాల వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీడీవో మాట్లాడుతూ చదువులేక పోవడం, సామాజిక విషయాల పట్ల చైతన్యం లేకపోవడం వంటి కారణాలతో



మాట్లాడుతున్న న్యాయమూర్తి కె. మధుస్వామి

నేటికి బాల్య వివాహాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. ఇది ఏమాత్రం సరికాదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించాల్సిన సామాజిక బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎస్.భూలక్ష్మి, ఆర్.సామ్రాజ్యంబాయి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనే ధ్యేయం

చిలకలూరిపేట టౌన్: బాల్య వివాహాలు చేసిన ప్రోత్సహించిన చట్టరీత్యా నేరమని ఎంపీడీవో కె.శ్రీనివాస రావు పేర్కొన్నారు. మండలంలోని పోత వరం గ్రామంలోని కస్తూర్బా బాలిక విద్యాలయంలో బుధవారం బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. బాల్య వివాహాల వలన కలిగే నష్టాలను గురించి బాలికల హక్కుల గురించి ఎంపీడీవో వివరించారు. కార్యక్రమంలో కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపాల్ షేక్ అఫ్రిపూన్, పంచాయతీ కార్యదర్శి వి తులసీదాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సామ్రాజ్యం, మహిళా పోలీస్ సీహెచ్ ఉమామహేశ్వరిలు పాల్గొని ప్రసంగించారు.

బాల్య వివాహ రహిత ఏపీని సృష్టిద్దాం

యడ్లపాడు: బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ రూపొందించేందుకు ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని హెచ్ఎం జి.శ్రీనివాసరావు చెప్పారు. మండలంలోని కొండవీడు గ్రామం ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థులకు బుధవారం బాల్య వివాహ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ నాదెండ్ల ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సొలస సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.జోజమ్మ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పీఎస్ చారి, వీఆర్వో కృష్ణచైతన్య, ఎంఎస్‌కె రాణి, ఏఎస్ఎం నాగమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్ నళిని, ఎస్ సువర్చల, ఎస్‌కె కరీమూన్, ఎం నాగసీలేశ్వరి, విద్యార్థులు, పీఎం కమిటీ చైర్మన్ రసూలు, కృష్ణవేణి, గ్రామస్తులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది, బాలికలు

బాల్య వివాహాలు చేస్తే కేసులు తప్పవు

నాదెండ్ల: బాల్య వివాహాలు జరిపినా, ప్రోత్సహించిన తల్లిదండ్రులు, బంధువులు, పురోహితులపై కేసులు నమోదు తప్పదని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల కృష్ణమాల చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో బాల్య వివాహాల రహిత భారతదేశం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ప్రతిజ్ఞ నిర్వహించి అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడ పిల్లలకు 18, మగపిల్లలకు 21 ఏళ్లు నిండకుండా వివాహాలు జరపటం చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలను జరిపే వారిపై చట్టప్రకారం శిక్షలు తప్పవన్నారు. తల్లిదండ్రులు తమ ఆడపిల్లలను చక్కగా చదివించి వారు ఆర్థిక స్వావలంబన సాధించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ మణికుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పోతవరంలో మానవహారంగా కస్తూర్బా గాంధీ విద్యాలయ విద్యార్థులు



మాట్లాడుతున్న హెచ్‌ఎం జి.శ్రీనివాసరావు



నాదెండ్లలో విద్యార్థినులతో మానవహారం, ప్రతిజ్ఞ

విద్యా సామర్థ్యాలను ఉపాధ్యాయులు పెంచాలి

డీఈవో చంద్రకళ



నాదెండ్ల జెడ్పీ హైస్కూలులో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

నాదెండ్ల: విద్యార్థుల్లో కనీస విద్యా సామర్థ్యాల పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని, చదవటం, రాయటం, చతుర్విధ ప్రక్రియలను పెంచాలని పల్నాడు జిల్లా విద్యా శాఖాధికారి ఎల్.చంద్రకళ చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా వంటగది పరిశుభ్రత, మధ్యాహ్న భోజన ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు మెరుగైన భోజనం అందించాలన్నారు. హాస్టల్‌లో ఉంటూ చదువుకునే విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సెలవుల్లో ఇంటికి వెళ్ళిన విద్యార్థులు సెలవుల అనంతరం తిరిగి రాకపోవటంపై వార్డెన్‌సుబ్బారావును ఆమె ప్రశ్నించారు. తిరిగి పాఠశాలకు హాజరుకాని విద్యార్థుల ఇళ్ళకు వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడాలన్నారు. తిరిగి పాఠశాలకు విద్యార్థులు హాజరయ్యేలా కృషి చేయాలన్నారు. దీర్ఘకాలికంగా గైర్హాజరైన విద్యార్థులు తిరిగి పాఠశాలలో చేరేలా స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షా ఫలితాల్లో పల్నాడు జిల్లాను మొదటిస్థానంలో నిలిపేందుకు పోటీతత్వంతో చదివి మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థుల వైద్య సౌకర్యాలపై ఏఎస్ఎంలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర బాలారోగ్య కార్యక్రమంలో భాగంగా ఏడాదికి రెండు పర్యాయాలు 3–10వ తరగతి విద్యార్థులకు మెడికల్‌క్యాంపులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎంలు శ్రీనివాసరావు, మణికుమారి, ఉపాధ్యాయులు కెల్లంపల్లి రెడ్డయ్యచౌదరి తదితరులు ఉన్నారు.

నేడు పూలే వర్ధంతి కార్యక్రమం

నరసరావుపేట: పల్నాడురోడ్డులోని మహాత్మా జ్యోతీరావు పూలే విగ్రహం వద్ద గురువారం ఉదయం 10గంటలకు నిర్వహించే వర్ధంతి కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదంచేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9.30కు పార్టీ కార్యాలయం వద్దకు నాయకులు, కార్యకర్తలు చేరుకోవాలని కోరారు.